# కనికరం లేని తల్లి




**–షేక్ షంషాద్ బేగం**

ఎలా ఈ గండం నుండి బయట పడాలోనని అందరిలాగే ప్రభాకరమూ ఆలోచిస్తున్నాడు. పైగా క్రితం నెల భార్య అనారోగ్యం వల్ల లోటు బడ్జెట్. జీతమొచ్చిన మర్నాడే జేబులు ఖాళీ అయ్యే సగటు జీవితానికి పిల్లల చదువు పెద్ద సమస్యే మరి.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? పిల్లల ఫీజుల గురించేనా?" భర్తకి టీ కప్పు అందించి ఎదురుగా కూర్చుంటూ అడిగింది ప్రభాకరం భార్య పద్మ.

అవునన్నట్లు తలాడించాడతను. పద్మ భర్త వైపు జాలిగా చూసింది. అప్పుడప్పుడు భర్తకు తెలియకుండా తీసి దాచుకున్న డబ్బులు సైతం ఇంటి వులుసులోనే పడిపోతుంది,తనేమివ్వగలదు?

"ఒక మాట చెప్పనా!" ఏదో స్ఫురించినట్లు హఠాత్తుగా అంది పద్మ.

"ఏమిటి?"

"మొన్నామధ్య మీ అమ్మగారిని అయిదొందలు అడిగి తీసుకొని మళ్ళీ యిచ్చేశారుగా. మళ్ళీ అడగండి" అంది.

"పాపం. ఆవిడకున్న అయిదువందలు. అస్తమాను .

"ఊరికే అడగటం లేదు రెండు నెలల్లో యిచ్చేద్దురుగానీ:

ప్రభాకరం ఆలోచించాడు. ఈ పరిస్థితుల్లో బయట అప్పు దొరకడం కూడా కష్టమే? భార్య చెప్పినట్లు చేసేస్తే ప్రస్తుతం ఈ గండం నుండి బయట పడవచ్చుననిపించింది.

"అమ్మా!" పిలిచాడు.

తల్లి కామాక్షి వచ్చింది.

"ఏమిట్రా" అంటూ

"అమ్మ, ప్రస్తుతం పిల్లలకి ఫీజులు కట్టాలి. ఆ మధ్య అయిదొందలు సర్దావుగా! ఆ డబ్బు మళ్ళీ యిచ్చావంటే – రెండు నెలల్లో తిరిగి యిచ్చేస్తాను" అని కొడుకు అన్నాడో లేదో – ఆమె కంగారు పడిపోయింది.

"నా దగ్గరా ... ఒక్క పైసా లేదు. అప్పుడేదో వుంది కాబట్టి సర్దాను గానీ – ఇప్పుడు నా దగ్గర పైసా లేదు నాయనా!" అంది.

ప్రభాకరం ముఖం చిన్నబోయింది. పద్మ అత్తగారివైపు గుర్రుగా చూసింది.

ఆ తర్వాత పద్మ, "అది కాదండత్తయ్య గారూ! ఖర్చులో వున్నారు కాబట్టి అడిగారు, రెండు నెలల్లో తప్పక ఇచ్చేస్తారు, మీ దగ్గర మాత్రం పెట్టెలో పడుండాల్సిందేగా!" అంది.

అంతే. వెంటనే కామాక్షి లేచి తన గదిలోంచి పెట్టె తీసుకువచ్చింది. కోడలు ముందు పెట్టింది. అందులో బట్టలన్నీ తీసి దులిపింది. దాంట్లో డబ్బులు లేవు.

ప్రభాకరం తెల్లబోయాడు. పద్మ ముఖం తిప్పుకొంది. కామాక్షి బట్టలు సర్దుకుని పెట్టెతో తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ ... అయినా ఆవిడ ఇదివరకటి మనిషి కాదు. చాలా మారిపోయారు. బహుశ ఆ డబ్బు మీ చెల్లెలికిచ్చి వుంటారు అయినా ఆ డబ్బులు మాత్రం అప్పుడప్పుడూ మీరుంచుకోమని యిచ్చిన డబ్బులేగా!" నిష్ఠూరంగా అంది పద్మ.

"పద్మా. ఆవిడ నేమీ అనకు!" అని భార్య మీద చిరాకు పడ్డాడే గానీ, తల్లి ప్రవర్తన అతనిక్కూడా నచ్చలేదు. ఒకరు యివ్వనంత మాత్రాన పనులు ఆగిపోవు గదా! వేరే ప్రయత్నం చేశాడు. పిల్లల ఫీజులు కట్టాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఒక రోజు కామాక్షికి అనారోగ్యం చేసింది. వెంటనే హాస్పటల్లో చేర్చవలసి వచ్చింది. డాక్టర్ ఫీజులు ... మందులు జేబులో వున్న డబ్బు ఖర్చు పెట్టాడు. ఆమె పరిస్థితి మరింత క్షీణించిందన్నారు డాక్టర్లు. ఖరీదైన మందులు వ్రాసిచ్చారు. అప్పుకోసం నానా తంటాలు పడ్డాడుగానీ. ఎక్కడా ఒక్క పైసా దొరకలేదు. ఒకే ఒక్క ఆశ. తల్లిదగ్గరకు వచ్చాడు.

"అమ్మా!" పిలిచాడు.

ఆమె కొడుకును చూసింది తల్లి వడగాలంటే గుండె కోస్తున్నంత బాధ ... అయినా తప్పని పరిస్థితి ...

"నీ దగ్గరున్న అయిదు వందలూ ఎక్కడ పెట్టావమ్మా?" చాలా అవసరం. మళ్ళీ యిచ్చేస్తాను" అన్నాడు కంట తడితో.

అంత అనారోగ్యంలోనూ, ఆ మాటలు విని ఆమె కంగారుపడింది. తల తిప్పేసుకొని, "నా దగ్గర లేవని చెప్పాను కదరా!" అంది నెమ్మదిగా–

లాభం లేదనుకున్నాడు. బయటకొచ్చాడు. మందుల షాపు వాడి కాళ్ళావేళ్ళా పడి మందులు తీసుకున్నాడు. హాస్పిటల్‌కు వచ్చాడు.

కానీ.

డాక్టర్ ఎదురై "సారీ ప్రభాకరం, ఆమెకు ఇవే చివరి ఘడియలు. ఇంటికి తీసుకువెళ్ళండి" అన్నాడు.

ప్రభాకరం నిర్ఘాంతపోయాడు. తల్లి దగ్గరకు వచ్చాడు. ఆమె డొక్కలు ఎగరేస్తుంది. ఆమె పిలిచినా పలకడం లేదు. కనీసం చూడడం లేదు. పద్మ, పిల్లలు మంచం అంచున కూర్చుని ఏడుస్తున్నారు.

ప్రభాకరం కొడుకును పిలిచి, "బాబూ! ఈ మందులు షాప్‌లో ఇచ్చేసిరా" అని పంపాడు. తన స్నేహితులకు కబురు పంపాడు. వారురాగానే తల్లిని ఇంటికి చేర్చాడు. బంధువులకి తెలియపరిచాడు. చెల్లెలి దగ్గరకు మనిషిని పంపించాడు. తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో కామాక్షి తుది శ్వాస విడిచింది.

తెల్లవారింది. కామాక్షి మరణవార్త ఊరంతా వ్యాపించింది.

ప్రభాకరం ఒక మూల ఏడుస్తూ కూర్చున్నాడు.

"ఎందుకు ఆలస్యం! అంతిమ యాత్రకు సిద్ధం చెయ్యండి" ఎవరో పెద్ద మనిషి అరిచాడు.

ప్రభాకరం జేబులు తడుముకున్నాడు. పైసా లేదు. ఈ పరిస్థితిలో కూడా అప్పుచేయవలసి వచ్చిన తన దౌర్భాగ్యపు పరిస్థితికి తనపై తనకే కోపం –

ఇంతలో–

"ప్రభాకరం మీ అమ్మగారు పోయారట గదా! ధైర్యంగావుండు. నిన్న ఏదో పనుండి విజయవాడ వెళ్ళి – ఉదయం వచ్చేసరికి ఈ వార్త." బాధగా అన్నాడు ప్రక్కింటి రమణయ్యగారు.

రమణయ్య గారంటే కామాక్షికి ఎంతో అభిమానం. అన్నయ్యా! అన్నయ్యా! అని పిలిచేది. అదే చెప్పి ఆయన బాధపడ్డాడు.

ఆయనే మళ్ళీ అన్నాడు.

చూడు నాయనా! ఇంకా ఆలస్యం దేనికీ. ఇదిగో ఈ అయిదు వందలు తీసుకో! ఈ అయిదువందలు నేనిస్తున్నవి గాదు, ఎప్పుడో మీ అమ్మే వుంచమని ఇచ్చింది. నా అంత్యక్రియల సమయంలో అయ్యో, తల్లి పోయిందనే వాడు బాధపడాలి గానీ – ఎలా ఈ గండం నుండి బయట పడాలని నా కొడుకు బెంగ పడకూడదని ఈ డబ్బు ఇచ్చింది. పైగా – ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని ప్రమాణం కూడా వేయించుకొంది నాయనా!" అని అయిదువందల కాగితాన్ని అతని చేతిలో పెట్టారు రమణయ్య.